సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం ¦ 22 ¦ జూన్ ¦ 2023



పెరగనున్న సాగు
గతేడాది కంటే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 4లో



నమ్మించి.. నట్టేట ముంచారు!
సొంతిల్లు నిర్మిస్తామంటూ అమాయకుల నుంచి రూ.లక్షలు వసూలు చేసిన కొందరు మూడేళ్లుగా పత్తా లేకుండా పోయారు. 6లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 26°

వాతావరణం
జిల్లాలో గురువారం ఎండ తీవ్రత తగ్గుతుంది. రాత్రి వాతావరణం కూడా చల్లబడుతుంది. అక్కడక్కడా వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

కళాశాల అభివృద్ధే ధ్యేయం



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగమునినాయక్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంతో పాటు కళాశాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. విద్యా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన ఆయన మంగళవారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మాట్లాడుతూ.. విద్యార్థులు అకడమిక్ పరీక్షలతో పాటు పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చామని, అందుకోసం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయించామని తెలిపారు. అలాగే, ఏటా కనీసం 200 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి చేస్తున్న కృషిని గుర్తించి తనతో పాటు ఉత్తమ హెచ్‌ఓడీగా ఏకే శ్రీకాంత్, ఉత్తమ లెక్చరర్‌గా ఎస్.రవీందర్‌కు అవార్డులు ప్రకటించారని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎలక్ట్రానింగ్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ అన్నారు. బుధవారం ఆయన పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. నమూనా ఓటింగ్‌లో ఏ పార్టీకి గానీ, గుర్తుపై కానీ ఓటు వేస్తే అదే సింబల్ వీవీ ప్యాట్‌లో ప్రింట్ అవుతోందా లేదా అనే విషయాన్ని చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన నోటిఫికేషన్‌లో భాగంగా జిల్లాలో కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ పీఈటీలకు సంబంధించి జిల్లాలో 69 ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఈనెల 26 నుంచి జూలై 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జూలై 7న 'భారజల' ఎన్నికలు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి టి.మోహన్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈనెల 30న 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, జూలై 1న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం 3.30 గంటలకు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. జూలై 7న పోలింగ్, 8న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు.

యోగాతో వ్యాధులు దూరం

కొత్తగూడెంఅర్బన్: యోగా చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష తెలిపారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వకాలంలో అందరూ యోగా చేయడం వల్ల ఎలాంటి వ్యాధులు లేకుండా ఆరోగ్యమైన జీవితాన్ని గడిపారని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది డీఎంహెచ్‌ఓ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ప్రోగ్రామ్ ఆఫీసర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, డాక్టర్ మణికంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానా సభలకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: తానా మహాసభలకు రావాల్సిందిగా భద్రాచలానికి చెందిన కవి చిగురుమళ్ల శ్రీనివాస్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన బుధవారం వివరాలు వెల్లడించారు. అమెరికాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 7,8,9 తేదీల్లో మహాసభలు జరుగుతున్నాయని, వాటికి తనను ఆహ్వానించారని తెలిపారు. సుమారు 15వేల మంది తెలుగు వారు పాల్గొనే ఈ మహాసభలకు తనను ఆహ్వానించిన తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



డిమాండ్ ఫుల్..
కొత్త గనులు నిల్

నల్ల బంగారానికి దేశ వ్యాప్తంగా ఆదరణ
- సింగరేణి బొగ్గు కోసం ఎన్టీపీసీ కొత్త ఒప్పందం
- ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యం 75 మిలియన్ టన్నులు
- నవంబర్ తర్వాతే కొత్త గనుల్లో ఉత్పత్తి ప్రారంభం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు ఉత్పత్తి ప్రారంభించి వందేళ్లు దాటినా సింగరేణి సంస్థ డిమాండ్‌కు ఢోకా లేకుండా పోయింది. ఓవైపు సోలార్ పవర్, పవన విద్యుత్ అంటూ కొత్తగా ఎన్ని వచ్చినా క్షేత్రస్థాయిలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికే మొగ్గు చూపుతున్నారు. దీంతో సింగరేణి బొగ్గు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యుత్ సంస్థలు క్యూ కడుతున్నాయి. అయితే ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి ఆపసోపాలు పడుతోంది.

ముందుగానే చెల్లింపులు..
రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించనుంది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) రామగుండంలో నిర్మిస్తున్న 1600 మెగావాట్ల ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ విద్యుత్ ప్లాంట్‌కు సింగరేణి బొగ్గు సరఫరా చేయాల్సి ఉంది. తాజాగా ఎన్టీపీసీ సైతం బొగ్గు సరఫరా కోసం సింగరేణితో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం కర్ణాటకలోని కుడిగి ప్లాంట్ (2,600 మెగావాట్లు)కు ఏడాదికి 6.70 మిలియన్ టన్నులు, మహారాష్ట్రలోని సోలాపూర్ ప్లాంట్(660 మెగావాట్లు)కు ఏడాదికి 2.82 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే గతంలో వలె బొగ్గు తీసుకున్న తర్వాత సొమ్ము చెల్లించడం కాకుండా ముందుగానే చెల్లించేందుకు ఎన్టీపీసీ అంగీకారం తెలిపింది. ఈ తాజా ఒప్పందంతో సింగరేణి బొగ్గుకు దేశవ్యాప్తంగా ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. అయితే డిమాండ్‌కు తగ్గ స్థాయిలో ఉత్పత్తి చేయడానికి సింగరేణి ఆపసోపాలు పడుతోంది. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, కొత్త గనులు ప్రారంభించడంలో ఆలస్యం జరుగుతూనే ఉంది.

అంచనా తప్పుతోంది..
గత ఆరు ఆర్థిక సంవత్సరాలుగా నిర్దేశిత లక్ష్యానికి తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి చేయడంలో సింగరేణి వెనుకబడి పోతోంది. తీవ్రమైన వాతావరణ అననుకూలతలు, సమ్మెలు వంటి అవరోధాలు లేకున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇందులో ప్రస్తుతం ఉన్న 25 భూగర్భ, 18 ఓపెన్ కాస్టుల ద్వారా 65 మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. మిగిలిన పది మిలియన్ టన్నుల్లో వెంకటేశ్‌ఖని - 7 (కొత్తగూడెం), జవహర్‌ఖని (ఇల్లెందు) ఓపెన్ కాస్టుల ద్వారా 5, ఒడిశాలోని నైనీ ఓపెన్‌కాస్ట్ ద్వారా మరో 5 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయాల్సి ఉంది. ఈ మూడు కొత్త గనులు ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికే అందుబాటులోకి రావాల్సి ఉండగా నేటికీ ఆ పని జరగలేదు.



అనుమతులు సాధించకుంటే కష్టమే..
రాబోయే రెండేళ్లలో ఏడాదికి 10 మిలియన్ టన్నుల సామర్థ్యంతో గోదావరిఖని -10, మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతో గోలేటి, 6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో భూపాలపల్లి ఓపెన్‌కాస్టులు ప్రారంభం కావాల్సి ఉంది. కొత్త గనులకు భూసేకరణ, పర్యావరణ అనుమతులు సాధించడంలో ముందు నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరించకుంటే ఈ గనులు సైతం సమయానికి అందుబాటులోకి రావడంలో సమస్యలు తప్పవు. మరోవైపు దేశవ్యాప్తంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉంది. దానికి తగ్గట్టుగా బొగ్గు సరఫరా చేయని పక్షంలో వారు విదేశీ బొగ్గు వైపు దృష్టి సారిస్తే అంతిమంగా సింగరేణికే నష్టం.

లక్ష్యం చేరుకునేనా..?
ప్రస్తుతం మూడు కొత్త ఓపెన్‌కాస్ట్ గనులకు అన్ని రకాల అనుమతులు వచ్చి ఉత్పత్తి ప్రారంభించాలంటే నవంబర్ వరకు పట్టవచ్చని అంచనా. అంటే ఆర్థిక సంవత్సరంలో దాదాపు మూడు త్రైమాసికాలు అప్పటికే పూర్తవుతాయి. దీంతో చివరి త్రైమాసికంలో డిమాండ్‌కు తగ్గస్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరుగుతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి సంస్థ ఆ తర్వాత సినర్జీగా మారుతూ థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో విజయవంతంగా అడుగులు వేసింది. కార్మికుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఏకతాటిపై ఉంటూ ఈ ఘనత సాధించారు. కానీ కొత్త గనులకు అనుమతులు సాధించే విషయంలో ఇప్పటికే సింగరేణి వెనుకబడిందనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది.

సమష్టిగా ప్రయత్నం



కొత్త గనులకు అనుమతులు సాధించే విషయంలో చైర్మన్‌తో సహా డైరెక్టర్లం సమష్టిగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఒడిశాలోని నైనీ, వీకే ఓసీ, జేకే ఓసీలకు సంబంధించి అన్ని అనుమతులు 2023 నవంబర్ నాటికి వస్తాయి. మిగిలిన గనులకు కేంద్రం నుంచి అనుమతులు రావాలి.
– ఎస్.వి.కె. శ్రీనివాస్, డైరెక్టర్(ఆపరేషన్స్)

వైభవంగా ఆధ్యాత్మిక దినోత్సవం



ప్రచార రథంతో జరిగిన నగర సంకీర్తనలో ఈవో రమాదేవి తదితరులు

- ప్రచార రథంతో నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు
- దాతలను సత్కరించిన ఈఓ





మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన విప్ రేగా తదితరులు

భద్రాచలం: తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ వేడుకల్లో భాగంగా బుధవారం భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు జరిపారు. ఉదయం 5.30 గంటకు ప్రచార రథంతో నగర సంకీర్తన చేశారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలు, శ్రీరామదాసు కీర్తలను ఆలపిస్తూ జరిపిన ఈ సంకీర్తన కనుల పండువగా సాగింది. అనంతరం బేడా మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని కొలువుదీర్చి వేద పారాయణం, సువర్ణ పుష్పార్చన జరిపారు. చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం చేశారు. ఆలయ అభివృద్ధికి, దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానం, ఇతర కార్యక్రమాలకు సహకరించే దాతలను ఈఓ రమాదేవి సత్కరించగా, వేద పండితులు ఆశీర్వదించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా నాదస్వరం, కోలాటాలు, దీపోత్సవాలతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్ రమాదేవి, ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ప్రధానార్చకులు విజయరాఘవన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా నిత్యకల్యాణం ..
స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం కమనీయంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్య ఆశీస్సులతోనే రాష్ట్ర ప్రగతి
జిల్లా, రాష్ట్ర ప్రగతిలో భద్రాద్రి రామయ్య ఆశీస్సులు మెండుగా ఉన్నాయని కలెక్టర్ అనుదీప్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో రామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 21 రోజుల పాటు జరిగిన ఉత్సవాల ముగింపు భద్రాద్రి క్షేత్రంలో జరపటం సంతోషంగా ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో అనతి కాలంలోనే ప్రగతి సుసాధ్యమైందని చెప్పారు. భద్రాచలం పేరు జిల్లాలో సగభాగమైందని, అందుకు జిల్లా ప్రగతిలో భద్రాచలానికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. భక్తులకు సకల సౌకర్యాల కల్పనతో పాటు, ఏపీలో ఉన్న స్వామి వారి భూముల రక్షణలోనూ సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీడీఎస్‌తో ఆలయాలకు మహర్దశ
గతంలో సమస్యలతో సతమతమైన చిన్న, మధ్యతరహా ఆలయాలకు సీఎం కేసీఆర్ ధూప, దీప నైవేద్యాల కోసం రూ.కోట్లు కేటాయించి మహర్దశ కల్పించారని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. తెలంగాణలో ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు ఆన్‌లైన్ సేవలు, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. భద్రాద్రి సీతారాముల దీవెనలు రాష్ట్ర అభివృద్ధికి ఉండాలని వేడుకున్నారు. అనంతరం అతిథులకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, ఆర్‌డీఓ రత్న కళ్యాణి, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

హస్తవాసికే జై!

- కాంగ్రెస్‌లో పొంగులేటి చేరిక లాంఛనమే..
- మాజీ ఎంపీ, జూపల్లితో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి భేటీ
- వచ్చేనెల మొదటి వారంలో ఖమ్మం సభతో కాంగ్రెస్‌లో చేరిక



టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డితో పొంగులేటి, ఆయన అనుచరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరగణం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో కొద్దినెలలుగా రాష్ట్రం, జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారిన పొంగులేటి వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లయింది. స్థానిక పరిస్థితులు, అనుచరులు, అభిమానుల కోరిక మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన వెల్లడించగా, ఇందుకు సంబంధించి ప్రకటనే మిగిలింది. హైదరాబాద్‌లో పొంగులేటిని ఆయన నివాసంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు పొంగులేటి ఇంటికి వస్తున్నారన్న సమాచారంతో ఉమ్మడి జిల్లా నుంచి ఆయన అనుచరులు హైదరాబాద్ వెళ్లారు.

ఆచితూచి అడుగులేసి..
ఈ ఏడాది జనవరి 1న పొంగులేటి శ్రీనివాసరెడ్డి మొదటిసారి బీఆర్‌ఎస్‌పై విమర్శలు మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఆయన పార్టీ మార్పుపై ఊహాగానాలు వస్తుండగా, తొలుత బీజేపీలో చేరతారని అంతా భావించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు పొంగులేటిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నించారు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ బృందం ఖమ్మం వచ్చి పొంగులేటితో భేటీ అయి ఆహ్వానించినా హామీ ఇవ్వలేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా చాపకింద నీరులా ప్రయత్నాలు చేసింది. అయినప్పటికీ పొంగులేటి ఎవరికీ హామీ ఇవ్వకుండా ఎప్పటికప్పుడు నాయకులు, తనతో కలిసొచ్చే వారితో చర్చలు జరిపారు.

'చేయి' అందుకునేందుకు..
ఐదున్నర నెలలుగా అనేకసార్లు సమావేశాలు, సభలు నిర్వహించిన పొంగులేటి అందరి సూచనలతో బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే సత్తా కలిగిన పార్టీలో చేరుతాననే చెప్పారు. కానీ కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం పొంగులేటి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో స్థానికంగా కాంగ్రెస్‌కు ఉన్న పట్టు, అనుచరులు, అభిమానుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 'హస్తం' పార్టీనే వేదికగా భావించినట్లు చెబుతున్నారు. ఇటీవల ముఖ్య నేతల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఖమ్మంలో ఏర్పాటుచేసిన సమావేశంలోనూ ఏకగ్రీవంగా అందరూ కాంగ్రెస్‌కే జై కొట్టడంతో ఆయన కూడా అటే మొగ్గుచూపారు.

పొంగులేటి బాటలో పయనం
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఉన్న ముఖ్య నేతలు, అనుచరులు, అభిమానులు పొంగులేటితో పాటు అడుగు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బానోతు విజయాబాయి, తుళ్లూరి బ్రహ్మయ్య, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ తదితరులు హైదరాబాద్‌లోని పొంగులేటి నివాసానికి వెళ్లారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు పొంగులేటి వెంట పయనించేందుకు సన్నద్ధమయ్యారు. వీరందరూ ఖమ్మంలో జరిగే సభలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

ఖమ్మం నడిబొడ్డున చేరాలని..
మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైంది. అయితే ఢిల్లీ, హైదరాబాద్‌లో కాకుండా వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మంలోనే భారీ బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్‌లో చేరేందుకు పొంగులేటి సిద్ధమవుతున్నారు. మూడు, నాలుగు రోజుల్లో నిర్ణయం ప్రకటించి ఖమ్మం వేదికగా బహిరంగ సభలో ఏఐసీసీ అగ్రనేతల సమక్షాన ఆయనతోపాటు ముఖ్య అనుచరులంతా కాంగ్రెస్ గూటికి చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తాను ఖమ్మం, పాలేరు, కొత్తగూడెంలో ఏదో ఒక చోట పోటీ చేయనున్నట్లు పొంగులేటి ప్రకటించారు.

ఇంకొన్ని రోజులు ఆగండి..

- వర్షాలు ఆలస్యమైనా ఆందోళన వద్దు
- పంట సాగుపై కేవీకే శాస్త్రవేత్తలు



పాల్వంచ మండలంలో దుక్కి దున్నుతున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని, వర్షాలు ఆలస్యమైనా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం.సుమన్ తెలిపారు. వర్షాధార పంటలు విత్తుకోవడానికి, నారుమడులు పోసుకోవడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు పలు సూచనలు చేశారు.

వరి : వరినారు పోసే రైతులు స్వల్ప, మధ్యకాలిక రకాలతో నారులు పోసుకోవచ్చు. మధ్యకాలిక వరి రకాలను జూలై 15 వరకు, స్వల్పకాలిక రకాలను జూలై చివరి వరకు నారు పోసుకోవచ్చు.

పత్తి : పత్తి సాగుచేసే రైతులు జూలై 20 వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. వారం రోజుల వ్యవధిలో ఎర్ర, చెలక వంటి తేలిక నేలల్లో 50-60 మీ.మీ వర్షపాతం, నల్లరేగడి వంటి బరువు నేలల్లో 60-75 మి.మీ వర్షపాతం నమోదైన తర్వాతే విత్తుకోవాలి.

కంది : కంది పంటను ఏకపంటగాను, పత్తి, పెసర, మినుము, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న పంటలో అంతరపంటగా విత్తి మంచి దిగుబడులు సాధించవచ్చు. కందికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించి మొక్కల సాంద్రతను పెంచి ఆగస్టు 15 వరకు విత్తుకోవచ్చు.

మొక్కజొన్న : మొక్కజొన్న నీటిఎద్దడిని తట్టుకోలేదు. ఈ విషయాన్ని గుర్తించి బోదెలు, దాల్ల పద్ధతిలో విత్తుకుంటే మొక్కకు తేమ అందుతుంది. అలాగే, మధ్యకాలిక సంకరాలను జూలై 15 వరకు స్వల్ప కాలిక సంకరాలను జూలై చివరి వరకు విత్తుకోవచ్చు.

జొన్న : జొన్న పంటను జూన్ చివరి వరకు విత్తుకోవచ్చు.

పెసర/మినుము : ఈపంటలు తక్కువ కాలపరిమితి ఆధారంగా జూలై 15 వరకు విత్తుకోవచ్చు.

వేరుశనగ : వేరుశెనగ పంటను జూలై 31వ తేదీ వరకు విత్తుకోవచ్చు.

పొద్దుతిరుగుడు : తేలిక నేలల్లో జూలై 15వ తేదీ వరకు, బరువు నేలల్లో ఆగస్టు 30వ తేదీ వరకు విత్తుకునే అవకాశముంది.

భద్రాద్రి ఆస్పత్రికి 'లక్ష్య'

- లేబర్ రూమ్ నాణ్యతకు దక్కిన అవార్డు
- మూడేళ్లలో రూ.6లక్షల నగదు పురస్కారం



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని 'లక్ష్య' అవార్డు వరించింది. నేషనల్ ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్లో భాగంగా కేంద్ర బృందం ఏప్రిల్ 21, 22 తేదీల్లో ఈ ఆస్పత్రిని తనిఖీ చేసింది. ఈ మేరకు అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ ఈనెల 6న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీకి సమాచారం అందించగా, వారు ఈనెల 19న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణకు తెలియజేశారు. ఏరియా ఆస్పత్రిలోని లేబర్ రూమ్‌కు 91 శాతం మార్కులు, ఆపరేషన్ థియేటర్‌కు 79 శాతం మార్కులు రాగా, లేబర్ రూమ్ మాత్రమే అవార్డుకు ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఏరియా ఆస్పత్రికి అవార్డు వచ్చినందుకు గాను ఏటా రూ.2 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.6 లక్షల నగదు పురస్కారం దక్కనుంది.

కేంద్ర బృందం పరిశీలించిన అంశాలివే..
'లక్ష్య' కార్యక్రమం అమల్లో భాగంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లలో అందిస్తున్న వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు పాటిస్తున్నారో పరిశీలించారు. మాతా శిశు మరణాల రేటు తగ్గించడమే కాకుండా సేవల్లో 100 శాతం సంతృప్తి ఇవ్వడమే 'లక్ష్య' పథకం ఉద్దేశం. ఆయా విభాగాల్లో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, సర్వీస్ ప్రొవిజన్, ఇన్‌పుట్, ఔట్‌కమ్, పేషెంట్ కేర్, గర్భిణి, బాలింత రికార్డుల నిర్వహణ, వసతులు, వైద్య సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.

అవార్డుకు నోచుకోని ఓటీ..
భద్రాచలం ఆస్పత్రిలోని ఓటీ (ఆపరేషన్ థియేటర్) కూడా లక్ష్య అవార్డుకు ఎంపికవుతుందని ఆస్పత్రి అధికారులు ఆశించారు. కానీ అనేక కారణాల దృష్ట్యా ఓటీ రూమ్ అవార్డుకు ఎంపికకాలేదు. ఆస్పత్రిలో సరిపడా స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడం, క్లినికల్ సర్వీసెస్ (స్క్రీనింగ్, అసెస్మెంట్, ప్లేస్‌మెంట్, ట్రీట్‌మెంట్ ప్లానింగ్, రోగులకు కౌన్సిలింగ్, కేస్ మెనేజమెంట్) తదితర అంశాల నిర్వహణలో లోపంతో ఓటీ అవార్డు అందుకోలేకపోయింది.

జూలైలో మరోమారు ఎన్‌క్వాస్ పర్యటన
భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో జూలై మొదటి వారంలో ఎన్‌క్వాస్ బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా ఓటీ రూమ్‌లో అందించే సేవలపై మరోమారు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. దీంతో ఏరియా ఆస్పత్రి అధికారులకు కొంత ఉపశమనం కలిగినట్టయింది. ఓటీ రూమ్ కూడా లక్ష్య అవార్డుకు ఎంపికయ్యేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మెరుగైన సేవలందేలా కృషి చేస్తున్నాం



లక్ష్య అవార్డు రావడం సంతోషంగా ఉంది. కష్టానికి ప్రతిఫలం దక్కిందని భావిస్తున్నాం. డాక్టర్లు, వైద్య సిబ్బంది సమష్టి కృషి, సహకారం వల్లే లక్ష్య వరించింది. ఇటీవలే ముస్కాన్ అవార్డు, ఇప్పుడు లక్ష్య అవార్డు రావడంతో మాపై బాధ్యత మరింత పెరిగింది. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలందిస్తాం.
– రామకృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

రేపు ఒలింపిక్‌ డే రన్‌

కొత్తగూడెంటౌన్‌: కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుంచి రైల్వే స్టేషన్‌ వరకు శుక్రవారం నిర్వహించే ఒలింపిక్‌ డే రన్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర ఒలింపిక్‌ డే రన్‌ కన్వీనర్‌ పుట్టా శంకరయ్య కోరారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, కోచ్‌లు కాశీహుస్సేన్‌, ఆదినారాయణ, స్వాతిముత్యం, ఎస్‌.కె ఇమామ్‌, హనుమంతరావు, సీహెచ్‌ గోపికృష్ణ, సత్తిబాబు, మల్లికార్జునరావు, ఇ.మొగిలి, కృష్ణారావు, బాల సుబ్రహ్మణ్యం, మట్టపర్తి రమేష్‌ పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్‌: అదుపు తప్పి ఓ ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరుకు ఆటోలో ఉప్పు బస్తాల లోడుతో వెళ్తుండగా వినాయకపురం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌ యడ్లపల్లి నాగేంద్రతోపాటు మరొకరికి గాయాలయ్యాయి.

తప్పిపోయిన బాలుడు


బాలుడు జగదీష్‌

దుమ్ముగూడెం: మండల పరిధిలోని చిన్న బండిరేవు గ్రామంలో బంధువుల ఇంటికొచ్చిన ఓ కుర్రాడు తప్పిపోయిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కేశవ్‌ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గొల్వానికొండ గ్రామానికి చెందిన గుండె బోయిన జగదీష్‌ బండిరేవు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. మూడు రోజుల క్రితం సాయంత్రం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేదు. దీంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడికి మతిస్థిమితం సక్రమంగా ఉండదని, గతంలో కూడా రెండు సార్లు తప్పిపోయాడని బంధువులు తెలిపారు.

ఫర్‌పెక్ట్‌ ఔట్‌సోర్సింగ్‌ ఏజెన్సీపై కేసు నమోదు

బూర్గంపాడు: మైనారిటీ గురుకుల కళాశాలల్లో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగాల నియామకంలో జరిగిన అక్రమాల విషయంలో ఫర్‌పెక్ట్‌ ఔట్‌ సోర్సింగ్‌ ఏజెన్సీ నిర్వాహకులపై బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మైనారిటీ గురుకుల కళాశాలల్లో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగాల కోసం 9 మంది నుంచి రూ.18.50 లక్షలు వసూళ్లకు పాల్పడినట్లు ఫర్‌పెక్ట్‌ ఔట్‌ సోర్సింగ్‌ ఏజెన్సీ నిర్వాహకులపై జిల్లా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై..

అశ్వారావుపేటరూరల్‌: ఒకరిపై కర్రలతో దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్‌ కుమార్‌ కథనం ప్రకారం... పాల్వంచ మండలం పాతసూరారం ప్రాంతానికి చెందిన భూక్యా రవి, బానోత్‌ దేవేంద్ర, గుగులోతు సాగర్‌, సంపత్‌ కొద్ది రోజులుగా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట సమీపంలో సీతారామ ప్రాజెక్ట్‌ కాలువ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమ బంధువైన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో దేవేంద్ర, సాగర్‌, సంపత్‌ కలిసి భూక్యా రవిపై సోమవారం రాత్రి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై..

దమ్మపేట: బాలికను ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ బాలిక ఈ నెల 18వ కళాశాలకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రవికుమార్‌ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వైరారూరల్‌: ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టగా త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 30 మందికి పైగా ప్రయాణికులతో ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తోంది. బస్సు వైరా మండలం స్టేజీ పినపాక వద్దకు చేరుకోగా, అదే సమయాన తల్లాడ వైపు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్‌ చేసే క్రమంలో ఎదురుగా ఇంకో లారీ వచ్చింది. దీంతో లారీని ఒక వైపు బస్సు తాకినా ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీసులు ఆర్టీసీ బస్సు, లారీని వైరా పోలీస్‌ స్టేషన్‌కు తరలించి ప్రయాణికులను మరో బస్సులో పంపించారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.13,346

పెరగనున్న సాగు


వరి పంట(ఫైల్‌)

- గత వానాకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 5,05,011 ఎకరాలు
- ఈసారి ఖరీఫ్‌లో 5,77,409 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- పత్తి, కంది, మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): గత వానాకాలం సీజన్‌ కంటే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అంచనా సిద్ధం చేసి ఆమోదం కోసం వ్యవసాయ కమిషనరేట్‌కు పంపారు. గత వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 5,05,011 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, ఈ సంవత్సరం వానాకాలంలో మరో 72,398 ఎకరాలు పెంచి 5,77,409 ఎకరాలుగా సాధారణ విస్తీర్ణాన్ని అంచనా వేస్తున్నారు. గత వానాకాలం కంటే ఈవానాకాలంలో వివిధ పంటల వారీగా పెరుగనున్న సాగు విస్తీర్ణాల వివరాలిలా ఉన్నాయి. గతకంటే వరి 759 ఎకరాలు, జొన్న 1,228 ఎకరాలు, మొక్కజొన్న 9,340, కంది 3,012, పెసర 481, మినుము 1,301, వేరుశెనగ 67, పత్తి 52,202, నువ్వులు 471, అలసంద 409 ఎకరాల్లో విస్తీర్ణం పెరగనుంది. ఇతర పంటలు మాత్రం 8,499 ఎకరాల మేర తగ్గనున్నాయి. పత్తి, కంది పంటలపై దృష్టి సారించిన నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఉద్యాన పంటల్లో మిర్చి 5000 ఎకరాలు, ఆయిల్‌పామ్‌ 3,275 ఎకరాలు, కూరగాయలు 1,815 ఎకరాలు, ఇతర పంటలు 1,517 ఎకరాల విస్తీర్ణం పెరగనుంది.

సాగు విస్తీర్ణం అంచనా వివరాలు(ఎకరాల్లో)

పంట	వానాకాలం (2022)	వానాకాలం (2023)
వరి	1,64,266	1,65,025
జొన్న	14	1,242
మొక్కజొన్న	50,910	60,250
కంది	6,288	9,300
పెసర	155	636
మినుము	205	1,506
వేరుశెనగ	2,083	2,150
పత్తి	1,62,100	2,14,302
నువ్వులు	79	550
అలసంద	65	474
ఇతరాలు	70,663	62,164
ఉద్యాన పంటలు		
మిర్చి	25,000	30,000
ఆయిల్‌పామ్‌	16,805	20,100
కూరగాయలు	3,185	5,000
ఇతరాలు	3,193	4,710
మొత్తం	5,05,011	5,77,409

లాభసాటి వ్యవసాయం చేయాలి



రైతులు లాభసాటి వ్యసాయం చేయాలనే లక్ష్యంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న పంటలను వేయాలని ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రైతులకు చైతన్యం కలుగజేస్తున్నాం. గత వానాకాలం కంటే ఈవానాకాలం జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగనుంది.

–కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

మల్లెలమడుగులో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్‌..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 21న 'మల్లెలమడుగులో విష జ్వరాలు'అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వైద్యాధికారి సంకీర్తన, జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. దోమలు, నీటి నిల్వ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించారు. మల్లెలమడుగు గ్రామంలో డెంగీ మరణాలు లేవని, ప్రజలు భయాందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ లింగ్యా నాయక్‌, హెచ్‌ఏ రాజేష్‌, ఏఎన్‌ఎం లలితకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

బాధితులకు వైద్య పరీక్షలు

భద్రాచలంఅర్బన్‌: పట్టణంలోని ఏఎస్‌ఆర్‌, జగదీష్‌ కాలనీల ప్రజలు కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నారు. వాంతులు, విరోచనాలు, జ్వరంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై సోమ, మంగళవారాల్లో కాలనీల్లో పర్యటించి, రక్త పరీక్షలు నిర్వహించారు. నీటి ద్వారానే ఈ పరిస్థితి ఏర్పడిందని బాధితులు చెబుతుండగా, మిషన్‌ భగీరథ అధికారులు ఆయా కాలనీల్లో సరఫరా అయ్యే నీటి శాంపిల్స్‌ను పరీక్షిస్తున్నారు. ఒకేసారి రెండు కాలనీల ప్రజలు అనారోగ్యం పాలైనా కారణాలను మాత్రం తేలలేదు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొందరు మంగళవారం డిశ్చార్జ్‌ అయ్యారు. చికిత్స పొందుతున్న ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరోవైపు వైద్యాధికారులు కాలనీల్లో ఫీవర్‌ సర్వే నిర్వహిస్తున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

యోగాతో ఆరోగ్యం పదిలం


యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌ వసంత్‌

కొత్తగూడెంటౌన్‌: యోగాతో ఆరోగ్యం పదిలమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌ వసంత్‌ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కోర్టులో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్‌ కమలారాణి న్యాయమూర్తులు, న్యాయవాదులతో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌ వసంత్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.శ్యాంశ్రీ, జి.భానుమతి, ఏ.నీరజ, బి.రామారావు, సులోచన, పీపీ పోసాని రాధాకృష్ణ మూర్తి, పీవీడీ లక్ష్మి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రమేష్‌కుమార్‌ మక్కడ్‌, పలివెల సాంబశివరావు, సీఏఓ అనిత వాణి, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కార్తీక్‌ (ఫైల్‌)

అశ్వారావుపేటరూరల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఎస్సై బి.రాజేశ్‌ కుమార్‌ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పేటమాలపల్లి చెందిన నార్సింగ్‌ కార్తీక్‌(33) ఈ నెల 11న రాత్రి ద్విచక్ర వాహనంపై నారంవారిగూడేనికి వెళ్తొస్తున్నాడు. ఈ క్రమంలో తహసీల్దార్‌ కార్యాలయంలో సమీపంలో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య అగ్నేష ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గుండాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన కుంజ జనార్దన్‌ (30) కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు గుండాల పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

రూ. లక్షలు కోల్పోయారు..

- ఆవేదనతో పోలీస్‌ స్టేషన్‌కు వస్తున్న బాధితులు
- జెన్‌కోలో ఉద్యోగాలంటూ మోసం చేసిన అక్రమార్కులు

పాల్వంచ: జెన్‌కో సంస్థలో ఉద్యోగాల కోసం ఆశపడి భారీగా డబ్బులు చెల్లించిన బాధితులు ఆందోళన చెందుతున్నారు. కేటీపీఎస్‌ యాష్‌ పాండ్‌ కింద పుల్లాయిగూడెంలో భూములు పోయిన వారి జాబితాలో పేర్లు చేర్చి కోర్టుల్లో కేసులు వేసి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామని ఓ వ్యక్తి కొందరు మధ్యవర్తులతో భారీగా వసూళ్లకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. ఇప్పటికే పదుల సంఖ్యలో బాధితులు సాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. పుల్లాయిగూడెం గ్రామంలో యాష్‌ పాండ్‌ కింద భూములు పోయిన సర్వే నంబర్లలో పేర్లు చేర్చిన పహణీలను సైతం చూపించడంతో ఉద్యోగం పక్కా అనే ఉద్దేశంతో రూ.లక్షలు ముట్టాకు ఇచ్చి మోసపోయినట్లు సమాచారం. జయమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇళ్లు అమ్మి, అప్పులు చేసి రూ.25లక్షల వరకు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. కొత్తగూడేనికి చెందిన ఓ కౌన్సిలర్‌ సైతం రూ.9 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. మిగితా వారు సుమారు రూ.3 నుంచి రూ.5లక్షల వరకు ఇచ్చినట్లు తెలుస్తోంది. పట్టణంలోని పలువురు యువకులు, వ్యాపారులు ఇలా డబ్బులు చెల్లించి మోసపోయారు. డబ్బులు ఇచ్చే క్రమంలో ప్రాంసరీ నోట్లు, చెక్కులు తీసుకోకపోవడంతో గట్టిగా అడిగే పరిస్థితి లేదని, ఏం ఆధారాలు చూపించాలో తెలియక కొందరు పోలీస్‌ స్టేషన్‌కు కూడా రావడంలేదు. డబ్బులు దండుకున్న ఇద్దరు కీలక సూత్రధారుల్లో ఒకరు మధిర, హన్మకొండ, పాల్వంచ తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల ఇళ్లు, భారీగా ప్లాట్లు కొనుగోలు చేశారని బాధితులు చెబుతున్నారు.

సూత్రధారులు ఇద్దరు ఎక్కడ?

బాధితులు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అక్రమంగా వసూళ్లకు పాల్పడిన బాపూజీ నగర్‌కు చెందిన సూత్రదారులు కనిపించకుండా పోయినట్లు తెలుస్తోంది. వారిని పట్టుకుంటే పుల్లాయిగూడెం భూముల్లో రెవెన్యూ రికార్డుల్లో ఎంత మంది పేర్లను చేర్చి డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారనే విషయం పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉంది. గతంలో వీఆర్వోలను ఆసరాగా చేసుకుని పహాణీల్లో పేర్లు చేర్చినట్లు బాధితులు చెబుతున్నారు. న్యాయం చేయకపోతే మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులతో ఇప్పటికే సీఐ, ఎస్‌ఐలు చర్చించారు. కాగా పాల్వంచ మండలంలోని పాండురంగాపురానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 10 మంది నుంచి వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం.

అలరించిన నృత్య ప్రదర్శన


చిన్నారుల కళా ప్రదర్శన


కార్యక్రమానికి హాజరైన భక్తులు

భద్రాచలం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యకళారూపాలు ఆహూతులను అలరించాయి. ఆలయంలో శ్రీరామదాసు కీర్తనలు మార్మోగాయి. వివిధ నృత్య పాఠశాలల చిన్నారులు తమ కళారూపాలతో రామాయణం, శ్రీ కృష్ణలీలలు తదితర ఇతివృత్తాలను వివరించారు. చిన్నారి వనం శ్రీముఖి రఘుమయి కుండ, పళ్లెంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను కట్టిపడేసింది. స్థానాచార్యులు కె.స్థలశాయి క్షేత్ర చరిత్రను వివరించారు. అనంతరం చిన్నారులకు ఈఓ రమాదేవి ప్రశంసాపత్రాలు అందించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

పాల్వంచరూరల్‌: కుక్క అడ్డురావడంతో బైక్‌ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటనపై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం బాబు క్యాంప్‌నకు చెందిన షేక్‌ ఫెజల్‌(26), గాంధీ కాలనీకి చెందిన గుగులోతు వీరస్వామి మంగళవారం రాత్రి కిన్నెరసాని నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని పునుకుల గ్రామ సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్‌ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఫెజల్‌ మృతిచెందాడు. వీరస్వామిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు.

నవోదయ ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల

కూసుమంచి: పాలేరులోని జవహర్‌ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 80 సీట్ల భర్తీకి ఏప్రిల్‌ 29న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న 4,308 మందిలో 3,733 మంది హాజరుకాగా, ఉత్తీర్ణులైన వారి వివరాలను విద్యాలయ సమితి బుధవారం విడుదల చేసిందని ప్రిన్సిపాల్‌ చంద్రబాబు తెలిపారు.

ఉత్తీర్ణత సాధించిన వారి హాల్‌టికెట్లు నంబర్లు

ఐ 3421914, ఎం 3421932, ఎం 3423058, ఈ 3423676, ఐ 3424418, ఎస్‌ 3420989, ఎస్‌ 3422226, బీ 3422922, జే 3422926, జే 3424541, కే 3421769, కే 3423775, కే 3424514, జే 3421453, ఎస్‌ 3422993, హెచ్‌ 3422744, డీ 3422880, ఎల్‌ 3424602, ఎల్‌ 3424690, ఎల్‌ 3424817, పీ 3420992, జే 3421232, ఐ 3421628, ఎం 3421920, జే 3421998, ఎం 3422034, కే 3422574, జే 3422997, జే 3423096, జే 3423570, ఎం 3423813, ఎం 3424178, ఎం 3424307, ఐ 3424439, కే 3424586, ఎల్‌ 3424684, జే 3424809, ఎల్‌ 3424810, ఎల్‌ 3425047, జే 3421770, జే 3422119, ఎస్‌ 3422155, జే 3422418, ఎస్‌ 3422549, ఎస్‌ 3423327, ఎస్‌ 3423522, ఎస్‌ 3423812, ఎస్‌ 3423881, జే 3424059, జే 3424224, జే 3424237, ఎస్‌ 3424398, ఎస్‌ 3424513, జే 3424601, ఎస్‌ 3425026, కే 3421340, కే 3421828, కే 3421849, కే 3422061, కే 3422103, కే 3422275, కే 3422595, కే 3423786, కే 3424119, కే 3424559, ఎల్‌ 3420994, ఎల్‌ 3421014, ఎల్‌ 3421173, పి 3421187, ఎల్‌ 3421755, ఎల్‌ 3421869, ఎల్‌ 3421874, ఎల్‌ 3422164, పీ 3423618, పీ 3423841, ఎల్‌ 3424411, పీ 3424442, ఎల్‌ 3424455, పీ 3424549, ఎల్‌ 3424877.

బాలికలు చైతన్యవంతులుగా ఎదగాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్‌ డేవిడ్‌రాజ్‌

భద్రాచలం: బాలికలు తమకు ఎదురవుతున్న సమస్యలపై పోరాడుతూ, ప్రశ్నిస్తూనే సమాజంలో చైతన్యవంతులుగా ఎదగాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్‌, గురుకులాల ఇన్‌చార్జ్‌ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్‌ డీడీ డేవిడ్‌రాజ్‌ సూచించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 'వాయిస్‌ ఫర్‌ గర్ల్స్‌' కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజన బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే కాక సమాజంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అపాయం ఎదురైన సమయంలో స్వీయ రక్షణకు బాలికలు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌ నుంచి వచ్చిన శిక్షకులు మాట్లాడుతూ భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు తదితర గురుకులాల నుంచి హాజరైన 240 మంది బాలికలకు పది రోజుల పాటు వివిధ అంశాల్లో తర్ఫీదు ఇస్తామని తెలిపారు. గిరిజన గురుకులం ప్రిన్సిపాల్‌ ఎం.దేవదాస్‌, కౌన్సిలర్లు సరయు, అనుశ్రీ, సింధు, భవిష్య, చరిత, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్‌ జిల్లాలో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం బీజాపూర్‌ జిల్లాలో పోలీసులు, మావోయిస్టులకు నడుమ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అయితే, ఘటన నుంచి మావోయిస్టులు తప్పించుకుని పోగా తిరుగు ప్రయాణంలో ఒక జవాన్‌ ప్రెజర్‌ బాంబును తొక్కడంతో అది పేలగా తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్‌ జిల్లాలోని గంగులూరు పోలీస్‌స్టేషన్‌ పరిధి పెడియా గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బీజాపూర్‌, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ పోలీసులు బుధవారం కూంబింగ్‌ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టుల స్మారక స్థూపం, స్థావరాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం మావోయిస్టులు తప్పించుకుని పారిపోగా, పేలుడు పదార్థాలు, నిత్యావసర వస్తువులు, మందులు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు తిరిగి వస్తుండగా మావోయిస్టులు ఏర్పాటుచేసిన ఒక ప్రెజర్‌బాంబును దంతెవాడ జిల్లాకు చెందిన డీఆర్‌జీ జవాన్‌ అజయ్‌ మాండవి తొక్కడంతో అది పేలగా గాయాలయ్యాయి. దీంతో ఆయనను బీజాపూర్‌ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అలాగే, ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు తీవ్రంగా గాయపడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్‌ పట్టివేత

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం పట్టణంలో బుధవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్‌ లారీని పోలీసులు పట్టుకున్నారు. 46 పశువులతో అంబేద్కర్‌ సెంటర్‌ నుంచి సారపాక వైపు వెళ్తున్న కంటైనర్‌ లారీని బ్రిడ్జి సెంటర్‌ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు మహ్మద్‌ శామ్యూల్‌(హర్యానా), షారుక్‌ (ఉత్తరప్రదేశ్‌), పర్వేజ్‌ (ఉత్తరాఖండ్‌)తోపాటు లారీ యజమాని అజ్జుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మధుప్రసాద్‌ తెలిపారు. 46 పశువులను పట్టుకుని పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

ఇంటిపై విరిగిపడ్డ చెట్టు

జూలూరుపాడు: మండలంలో బుధవారం గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లోని చెట్లు విరిగిపడ్డాయి. భేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెం గ్రామానికి చెందిన భట్టు సురేష్‌ రేకుల ఇంటిపై చింత చెట్టు విరిగిపడింది. గమనించిన సురేష్‌ భార్య, పిల్లలను ఇంట్లో నుంచి బయటకు తీసుకుని రావడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటితోపాటు సామగ్రి మొత్తం ధ్వంసమైంది. గాలిదుమారంతో విద్యుత్‌ సరఫరాకు సుమా రు 2 గంటల పాటు అంతరాయం ఏర్పడింది.

యువతి అదృశ్యం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి విద్యార్థిని అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన యువతి పిట్టా రమ్య ఈ నెల 20న కిరాణదుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భద్రాచలానికి చెందిన పట్టాభి అనే వ్యక్తిపై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 5 నిర్మాణాలకు ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత 'ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డు'లను లండన్‌లో అందుకున్న ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆ అవార్డులను కేసీఆర్‌కు అందజేశారు.

అనస్తీషియాలజిస్ట్ విభావరి ఘనత

ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియా గౌరవ కార్యదర్శిగా ఎన్నిక



బంజారాహిల్స్ (హైదరాబాద్): బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియాలజిస్ట్, ఇంటెన్సివ్ వైద్య నిపుణురాలు డాక్టర్ విభావరి నాయక్ ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియాకు గౌరవ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదటిసారి భారతీయ వైద్యురాలు ఈ పదవికి ఎన్నికయ్యారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఆమెను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు ఆమె ఈ పదవికి ప్రాతినిధ్యం వహిస్తారు. 2010 నుంచి బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే ప్రతి ఒక్కరితో పనిచేసే గొప్ప అవకాశాన్ని పొందానని ఆనందం వ్యక్తం చేశారు.

పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ (టీసీటీజీవోఏ) రాష్ట్ర అధ్యక్షునిగా వి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా మురళీమోహన్, సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దేవేందర్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్.భాస్కర్, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.రామలక్ష్మయ్య, కోశాధికారిగా ఎస్.గిరిధర్, జాయింట్ సెక్రటరీలుగా బి.రాజు, డి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కందిమళ్ల సుధీర్‌రెడ్డి, బీమ్లా, నరేశ్‌రెడ్డి, విజయ్, మురళి ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు పదవుల్లో కొనసాగనున్నారు.

హస్తినలో బంగారు బోనం

ఘనంగా లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాలు ● బంగారు బోనాలు సమర్పించిన బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ పాతబస్తీ లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుధవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. అలాగే బీఆర్ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేత మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ, పట్టణ, వ్యవసాయం, ఐటీ.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకపోయినా చెరువుల పునరుద్ధరణ చేశారని, ప్రాజెక్టులను నిర్మించారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఆదరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణ పాలనపై పక్క రాష్ట్రాల్లో చర్చ జరుగుతోందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు.



బంగారు బోనం తీసుకెళ్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీఆర్ఎస్ ఎంపీలను అడ్డుకున్న శేజల్


ఇదిలా ఉండగా బోనాల కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు నిరసన సెగ తగిలింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భవన్ వేదికగా గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న శేజల్, ఎంపీలను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఎంపీల వాహనానికి అడ్డుగా నిలిచి శేజల్, ఆరిజన్ డైరీ నిర్వాహకుడు ఆదినారాయణ నిరసన వ్యక్తం చేయగా.. ఎంపీ సురేశ్‌రెడ్డి కారు దిగివచ్చి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఏజీ బీఎస్ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తులు

ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావుకు 'బూటి' అవార్డు

సాక్షి, హైదరాబాద్: శాస్త్ర సంబంధిత సమాచారాన్ని సామాన్యుల చెంతకు చేర్చేందుకు విశేష కృషి చేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త, న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు.. ప్రతిష్ఠాత్మక బూటి ఫౌండేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్లాస్మా ఫిజిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ బిమలా బూటి ఏర్పాటు చేసిన బూటి ఫౌండేషన్ అవార్డును గుజరాత్ సైన్స్ అకాడమీ అందజేస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు భవిష్యత్తుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేసిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.



గోవా రాజ్‌భవన్‌లో యోగా దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గ్రూప్‌-1 ప్రిలిమ్స్ రద్దు చేయండి

మళ్లీ నిర్వహణకు హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడం అక్రమాలకు తావిచ్చేలా ఉందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వాన్ని, టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరుతూ గ్రూప్‌–1 అభ్యర్థులు బి.ప్రశాంత్, బండి ప్రశాంత్, జి.హరికృష్ణ పిటిషన్ వేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రతివాదిగా పేర్కొన్నారు. హాల్ టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని.. ఇది అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం ఇచ్చేలా ఉందని స్పష్టం చేశారు. ఒకసారి లీకై మళ్లీ నిర్వహిస్తున్న గ్రూప్‌–1 విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవలసిన కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 13న టీఎస్‌పీఎస్సీకి వినతి పత్రం కూడా నిచ్చినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. న్యాయవాది బి.నర్సింగ్ ఫైల్ చేసిన ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ మాధవిదేవి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఘనంగా ప్రారంభమైన సాహితీ సభలు
- ఆచార్య ఎస్.గోపికి జయశంకర్ పురస్కారం ప్రదానం



ఆచార్య ఎన్.గోపికి స్వర్ణకంకణం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ సాహిత్య వికాసాన్ని, సాహితీ పుత్రులను నిరంతరం స్మరించుకోవడంతో పాటు తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన తెలంగాణ సాహిత్య సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎన్.గోపికి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తొలి విశిష్ట సాహితీ పురస్కారం –2023ను కవిత ప్రదానం చేసి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకోవడం ఎంత ముఖ్యమో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్న నినాదంతో ఉద్యమం చేశామన్నారు. తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ వారు మరింత పరిపుష్టం చేయాలన్న ఉద్దేశంతో భారత జాగృతి ఆధ్వర్యంలో సాహితీ సభలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై ఏటా తెలంగాణ సాహిత్య సభలు జరుపుతామని ప్రకటించారు. రెండురోజుల పాటు జరగనున్న సాహిత్య సభల్లో పలు అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ చర్చలన్నింటిని గ్రంథస్తం చేస్తామని చెప్పారు. కాగా, సాహితీ ప్రేమికులుగా హిందీభాషలో ఉన్న సాహిత్యాన్ని ఆరాధిస్తామని, కానీ ఇదే మాట్లాడాలని రూల్స్ పెడితే మాత్రం తప్పకుండా రూల్స్ బ్రేక్ చేస్తామని పేర్కొన్నారు. దేశంలో తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలో కూడా వేతనాలు చెల్లిస్తూ కళాకారులను గౌరవించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపికి విశిష్ట సాహిత్య పురస్కారం కింద స్వర్ణ కంకణంతో పాటు రూ.1,01,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిని సిధ్దారెడ్డి, డాక్టర్ గోరటి వెంకన్న, డాక్టర్ తిరునగరి దేవకీ దేవి, డాక్టర్ గోగు శ్యామల, డాక్టర్ నాళేశ్వరం శంకర్, జాగృతి కార్యకర్తలతో పాటు పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు

కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్
- కన్హా శాంతివనంలో దివ్యాంగుల సామూహిక యోగా
- మూడు రికార్డులు సొంతం

నందిగామ: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 రాష్ట్రాలకు చెందిన 3వేల మంది దివ్యాంగులు సామూహిక యోగా చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీరేంద్ర కుమార్ యోగాసనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సామూహికంగా భారీ ఎత్తున పాల్గొని యోగా చేసినందుకుగాను అంతర్జాతీయ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు. అనంతరం దృష్టి, వినికిడి, అంగవైకల్యం కలిగిన సుమారు 200 మందికి సహాయ ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

ఐటీ హబ్‌లో రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార శాఖల సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 23న ఖమ్మంలోని ఐటీ హబ్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. టామ్‌కామ్ ఆధ్వర్యాన గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, పోలాండ్, రుమేనియా, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల్లో ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా దేశాల్లో మైనింగ్, ప్లాంట్ మెకానిక్, ఫిట్టర్, మెకానికల్ ఇంజనీర్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఈమేరకు 22నుంచి 28 ఏళ్ల వయస్సుకలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలకు 78935 66493, 97017 32697 నంబర్లలో లేదా www.tomcom.telangana.gov.in సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా వెంకన్న



వెంకన్నకు అవార్డు అందజేస్తున్న మంత్రి

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం కార్యదర్శి, ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్న ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సన్మానించి అవార్డు అందజేశారు. ఈసందర్భంగా వెంకన్నను ప్రిన్సిపాల్ డాక్టర్ జకీరుల్లా, అధ్యాపకులు డాక్టర్ ఎన్.గోపి, డాక్టర్ జె.రమేష్ అభినందించారు.

ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో షెడ్

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఆవరణలో రైతులు, డ్రైవర్ల సౌకర్యార్థం రూ.8 లక్షలతో ఫార్మర్ షెడ్ నిర్మించనున్నారు. గెలలతో వచ్చే రైతులు, డ్రైవర్లు సేద తీరేందుకు షెడ్ నిర్మించడంతో పాటు తాగునీరు, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని పలువు రు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డికి విన్నవించారు. దీంతో రూ.8లక్షలు మంజూరు చేయగా, వెయ్యి చదరపు అడుగుల్లో నిర్మించే షెడ్ నిర్మాణానికి డీఓ బాలకృష్ణ బుధవారం భూమి చేశారు. అదనపు మేనేజర్ నాగబాబు, వెంకటేశ్, పవన్, రైతులు పుల్ల య్య, సీతారామస్వామి, రమణారావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచారు!

- స్వచ్ఛంద సంస్థ పేరిట ఇళ్ల నిర్మాణానికి రూ.లక్షల్లో వసూలు
- పనులు ప్రారంభించి ఆపై ఉడాయించిన వైనం
- మూడేళ్లుగా ఎదురుచూపులతో నీరసించిన గిరిజనులు మధ్యవర్తులుగా వచ్చిన గూడూరు వాసులపై ఫిర్యాదు



మూడేళ్లుగా పునాది దశలో నిలిచిపోయిన నిర్మాణం



బాధితుల నుంచి డబ్బు తీసుకుంటున్న సంస్థ ప్రతినిధులు (ఫైల్)

ఇల్లెందురూరల్: సొంతింటి కల సాకారం చేస్తామని స్వచ్ఛంద సంస్థ పేరుతో పల్లెలకు వచ్చి అమాయక గిరిజనుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన వారు మూడేళ్లుగా కానరాకుండా పోయారు. దీంతో ఎదురుచూపులతో నీరసించిన బాధితులు న్యాయం కోరుతూ తాజాగా పోలీసులను ఆశ్రయించారు. ఇంటి కల నెరవేరుతుందనే ఆశతో పలువురు డబ్బులు చెల్లించగా.. బాధితుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పరిసర ప్రాంతాలతో పాటు మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి తదితర జిల్లాల వారు ఉన్నట్లు తెలుస్తోంది.

మధ్యవర్తుల సాయంతో..

ఏజెన్సీ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అంటే ప్రజలు ఆకర్షితులవుతారని భావించిన ఓ ముఠా స్వచ్ఛంద సంస్థ పేరిట రంగంలోకి దిగింది. మధ్యవర్తులుగా సమీప గ్రామాల వారిని కలుపుకుని తొలుత ఇల్లెందు మండలం పోలారం గ్రామ పంచాయతీ వాసులను నమ్మించగా పది మంది వరకు డబ్బు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఆ తర్వాత మాణిక్యారానికి వెళ్లి తమ సంస్థ ద్వారా మహబూబాబాద్, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని నమ్మబలికారు. అంతేకాక పోలారం, మాణిక్యారం గ్రామాల నుంచి కొందరు పెద్దలను తీసుకుని మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ప్రారంభమైన నిర్మాణాలను చూపించారు. దీంతో వీరికి నమ్మకం ఏర్పడగా సంస్థ బాధ్యులు చెప్పినట్లుగా వాటా ధనం రూ.1.65 లక్షలు చెల్లించారు. ఇలా ఒక్క ఇల్లెందు మండలంలోనే సుమారు 30 మంది వరకు డబ్బు ఇచ్చినట్లు సమాచారం. ఆ వెంటనే డబ్బు చెల్లించిన వారు చూపించిన స్థలంలో ఇంటి నిర్మాణ పనులను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. కొన్నిచోట్ల పిల్లర్ల నిర్మాణం కోసం గుంతలు తవ్వగా, మరికొన్ని చోట్ల పిల్లర్లు కూడా నిర్మించారు. ఆ తర్వాత పనులు ఆపేసి మూడేళ్ల నుంచి కానరాకుండా పోయారు.

ఆలస్యంగా గుర్తించిన బాధితులు

నిర్మాణ పనులు ప్రారంభించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆ తర్వాత కన్నెత్తి చూడకపోవడంతో బాధితుల్లో అనుమానాలు రేకెత్తాయి. సంస్థ బాధ్యుల చేతిలో మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించి మధ్యవర్తుల కోసం అన్వేషించారు. వీరు మహబూబాబాద్ జిల్లా గూడురు మండల వాసులని తెలియడంతో వారిని ఆరా తీయడంతో పాటు తొలుత తాము చూసిన ప్రదేశాల్లోనూ ఇళ్ల నిర్మాణం పునాది దశలోనే ఉందని తేలింది.

దీంతో మధ్యవర్తులపై మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీసుస్టేషన్‌లో ఇల్లెందు మండలం బాధితులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా మధ్యవర్తులుగా వ్యవహరించిన వారిని విచారిస్తామని, బాధితులంతా గురువారం రావాలని పోలీసులు సూచించినట్లు బాధితులు తెలిపారు.

నమ్మించి మోసం చేశారు



డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మిస్తామని సంస్థ పేరుతో వచ్చిన వారిని నమ్మాం. కొన్ని జిల్లాల్లో పనులు ప్రారంభమైనట్లు చెప్పగా చూసి నిర్ధారించుకున్నాం. మేం రూ.1.65 లక్షలు చెల్లిస్తే మిగతా డబ్బు వారు కలిపి ఇల్లు నిర్మిస్తామని చెప్పిన ప్రతినిధులు ఉడాయించారు.

–మోదెం అనిల్, పోలారం, ఇల్లెందు మండలం

మూడేళ్లుగా ఎదురు చూసి..



స్వచ్ఛంద సంస్థ పేరుతో వచ్చిన వారి మాటలను నమ్మాం. భాగస్వామ్యం పేరుతో వారు అడిగినంత చెల్లించాం. కానీ మూడేళ్లుగా అడ్రస్ లేకపోవడంతో మోసపోయామని తెలిసింది. మధ్యవర్తులుగా వచ్చిన వారి అడ్రస్ సేకరించి గూడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

–అజ్మీరా రవి, పోలారం, ఇల్లెందు మండలం

అత్యల్ప వడ్డీ రేట్లతో గృహ రుణాలు

ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ విజయ్‌భాస్కర్



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

ఖమ్మంవ్యవసాయం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అత్యల్ప వడ్డీ రేట్లతో గృహ రుణాలను ఇస్తున్నామని రీజినల్ మేనేజర్ విజయ్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. ఖమ్మంలోని రీజినల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ రుణాలు తీసుకునే వారి కోసం ఈ నెల 30వ తేదీ వరకు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో రుణాలు తీసుకునే వారికి ప్రాసెసింగ్ ఫీజు ఉండదని చెప్పారు. అలాగే, తమ బ్యాంకులో వడ్డీరేట్లు అత్యల్పంగా 8.35 శాతం వరకు, సాధారణ గృహ రుణాలకు 8.55 శాతం నుంచి వడ్డీ రేట్లు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే, మహిళలకు 0.05 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఇక బ్యాంక్ డిపాజిట్లపై అత్యధికంగా 7.5 శాతం, సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.5 శాతం వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ దేవేందర్, అధికారులు సంతోష్, యార్లగడ్డ అన్వేష్, స్పందన్, కె.సత్యనారాయణ, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో ఓ బీజేపీ నాయకుడిని మావోయిస్టులు హతమార్చారు. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎలిమిడి ప్రాంతంలోని లంకపారా గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కాకా అర్జున్ బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు రాగా, ఆ సమయంలోనే అక్కడికి వచ్చిన మావోయిస్టులు తుపాకీతో మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో అర్జున్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడన్న నేపంతోనే మావోయిస్టులు అతడిని హతమార్చినట్లు సమాచారం.

సింగరేణి 'మెడికల్ బోర్డు'పై నిఘా

సింగరేణి(కొత్తగూడెం): రెండు రోజులపాటు సింగరేణి ప్రధానాస్పత్రిలో నిర్వహించనున్న మెడికల్ బోర్డు సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రధానాస్పత్రి, పరిసర ప్రాంతాల్లో రోగుల పేరుతో కొందరు దళారులు వస్తున్న విషయాన్ని గమనించిన యాజమాన్యం నిఘా పెంచింది. కాగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పర్యవేక్షణ చేపట్టారు. మెడికల్ బోర్డుకు సింగరేణి వ్యాప్తంగా అన్‌ఫిట్ (ఇన్వాలిడేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులు, వారి సహాయకులు వచ్చారు. ఈ క్రమంలో కొందరు దళారులు, ప్రజాప్రతినిధుల ఏజెంట్లు ఆస్పత్రికి చేరుకుని పైరవీ చేస్తున్నారనే సమాచారంతో యాజమాన్యం నిఘా పెంచింది. ఈ క్రమంలో సింగరేణి విజిలెన్స్, ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ విభాగాలు అప్రమత్తమైనట్లు తెలిసింది. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.



సింగరేణి ఆస్పత్రిలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ తదితరులు

జాతీయ అథ్లెటిక్స్ క్యాంప్‌నకు ఎంపిక

కొత్తగూడెంటౌన్: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో గురువారం ప్రారంభం కానున్న జాతీయ అథ్లెటిక్స్ టాలెంట్ అసెస్‌మెంట్ క్యాంప్‌నకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత ఫిబ్రవరిలో పాట్నాలో జరిగిన జాతీయ పోటీల్లో కనబర్చిన ప్రతిభ ఆధారంగా దుమ్ముగూడేనికి చెందిన కట్టం హారిక, భద్రాచలానికి చెందిన షేక్ అఫ్రీన్, పార్కలగండికి చెందిన వాలకం సంతోష్, పాల్వంచకు చెందిన అభినవనాయక్‌లను ఎంపిక చేసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహీధర్ తెలిపారు. వీరితో పాటు కోచ్‌లు సనంద కోరి(ఇల్లెందు), పి.నాగేందర్(పాల్వంచ) జాతీయ క్యాంప్‌నకు బయలుదేరారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా చైర్మన్ జీ.వీ.కే.మనోహరరావు, అధ్యక్షుడు గొట్టాపు రాధాకృష్ణ అభినందించారు.



క్యాంప్‌నకు బయలుదేరుతున్న క్రీడాకారులు, కోచ్‌లు

సీతమ్మసాగర్'కు ఈనెల 28న ద్విసభ్య కమిటీ

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట దిగువన నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నియమించిన ద్విసభ్య కమిటీ ఈ నెల 28న పరిశీలించనుంది. పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారంటూ దుమ్ముగూడెం మండలానికి చెందిన నిర్వాసితులు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. దీంతో పనులు నిలిపేయాలని మార్చి 23న ఎన్‌జీటీ ఉత్తర్వులు జారీ చేసినా పనులు చేపడుతుండటంతో మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌జీటీ ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ ఈ నెల 28న సీతమ్మసాగర్ బ్యారేజీని సందర్శించి నివేదికను ఎన్‌జీటీకి అందించనుంది. కాగా, ఈ నెల15న అశ్వాపురంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా నిర్వాసితులు, ప్రజలు తమకు ఎంతో ఉపయోగపడే ప్రాజెక్టుకు త్వరగా పర్యావరణ అనుమతులు జారీ చేసి, పనులు పూర్తి చేయాలని కోరిన విషయం విదితమే.

నాయబ్ తహసీల్దార్‌గా ఎఫ్ఆర్వో సతీమణి భాగ్యలక్ష్మి



ఉత్తర్వులు అందజేస్తున్న భద్రాద్రి కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విధి నిర్వహణలో హత్యకు గురైన ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు భార్య బండి భాగ్యలక్ష్మికి నాయబ్ తహసీల్దార్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉత్తర్వులను జారీ చేసినట్లు భద్రాద్రి జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఐడీఓసీలో భాగ్యలక్ష్మికి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీనివాసరావు భార్యకు గ్రూప్‌–2 సర్వీసెస్ కింద కారుణ్య నియామకపు ప్రాతిపదికన జిల్లా జోన్‌–4లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద ప్రత్యేక కేసుగా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., and Printed at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08742-282823 - 24, Fax No.08742 - 282825, RNI Regn No. TEL TEL/2008/23797.